జీవితంలో మంచి చేద్దామనుకున్న ఇద్దరు మిత్రులకు ఎదురైన సమస్యలు?

# కాకులు

ఆరెమండ రమేష్ కుమార్ కథ

రఘురాం లంచ్ ముగించి ఆఫీసుకు బయల్దేరాడు. తలుపేసుకోమని భార్యకు చెప్పి బయటకు నడిచాడు.

సూర్యుడు తన ప్రతాపాన్నంతా చూపెడుతున్నాడు. ఎండ మండుతోంది — ఉల్లిపాయల ధరలా... వేడిగాలి... కాదు కాదు వడగాలి.

"అబ్బబ్బ. ఇక్కడ ఎప్పుడూ ఎండలే అన్ని కాలాలూ ఎండాకాలమే!"


స్కూటర్ బయటకు తీశాడు. స్టార్ట్ చేయబోతుండగా... సరిగ్గా అప్పుడు పడింది వేపచెట్టు కొమ్మ మీంచి.

"చిన్న కాకిపిల్ల"... బహుశా గుడ్డులోంచి బయటపడి రెండు రోజులై వుంటుందేమో! ఇంకా ఈకలైనా సరిగా రాక లోపలి ఎముకలన్నీ కనిపిస్తూ... సరిగ్గా చెప్పాలంటే సోమాలియాలో అంతర్యుద్ధానికి బలవుతున్న ఒక సామాన్యుడిలా, కడుపులోకి తిండిలేక.. కప్పుకోడానికి బట్టల్లేక... ఎముకలపై చర్మం కప్పినట్టు...

చిన్నగా అటూ ఇటూ కొట్టుకుంటుంది షేర్ మార్కెట్ సెన్సిటివ్ ఇండెక్స్‌లా. రఘురాం జాలిపడ్డాడు. స్కూటర్ పార్క్ చేసి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

అది భయంగా అతనివైపు చూసింది... "నక్సల్స్‌తో ఎన్‌కౌంటర్‌కి అడవిలోకి వెళ్తున్నామని" పై అధికారి చెప్పినప్పుడు కానిస్టేబుల్ చూసే చూపులా. క్రింద పడిన దెబ్బకు శరీరం కదలనని అంటున్నా భయం ఎక్కడలేని ఓపికనిచ్చి రఘురాం చేతిలోంచి తప్పించుకోవాలని గింజుకుంటుంది.

దాని శరీరం వణుకుతుంది. హ్యాజల్‌బా



ల్ మసీదులో చిక్కుబడిపోయిన సివిలియన్ శరీరంలా.

□ ■ □

రవి స్కూటర్ స్లో చేశాడు. రోడ్డుకు ఒక ప్రక్కగా బాగా జనం మూగి వున్నారు. ఏదో విషయమై అందరూ ఒక వలయంగా చేరి గుసగుసలాడుకుంటున్నారు. రవి స్కూటర్ రోడ్డుకు ఒక వారగా పార్క

చేశాడు.

అందరూ దాన్నే పరీక్షగా చూస్తున్నట్టు దూరాన్నుంచే గమనించాడు రవి. క్యూరియాసిటీ ఆపుకోలేక జనంమీంచి తొంగి చూశాడు. అందరి మధ్యలో నడిరోడ్డుమీద ఒక...

"పసికందు" పుట్టి ఏ కొద్ది గంటలు అయి వుంటుందో, శరీరంపైన ఎండిపోయిన మాయతాలూకు పొరలు ఇంకా పోలేదు. ఆ 'శరీరం' చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. ఒక్కసారి కడుపులో దేవినట్లు అనిపించింది రవికి.

"ఎవరో! ఏ తల్లి పుణ్యమో! ఈ రోజుల్లో ఇదో ఫాషనైపోయింది. ఎవడితోనో కన్నూ మిన్నూ కానకుండా తిరగడం... బిడ్డల్ని కని ఇలా రోడ్డుమీద పారెయ్యడం"

రవికి ఇవేమీ వినబడ్డం లేదు. జనం కాళ్లమధ్యనుంచి చిన్నగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ పసికందువైపు వెళ్తున్న ఓ కుక్కను చూశాడు.

అతనితోబాటు మిగతావాళ్లుకూడా చూశారు. అంతా ఒక్కసారిగా నిశ్శబ్దం. ఎవ్వరూ కదిలే ప్రయత్నంగాని, దాన్ని అదిలించే ఆలోచనగాని చెయ్యడంలేదు. అదో అర్థంకాని స్థితి.

రవికి ఏం పాలుపోలేదు. ఏదో చెయ్యాలన్న తపన. దాన్ని ఆపాలి. ఎలా అప్పటికే ఆ కుక్క, ఆ చిన్న అమాయకమైన 'పసికందు' దగ్గరకు వెళ్లిపోయింది.

ఎవరో, ఏ కొద్ది మానవత్వం కదిలిందో "ఛాయ్... ఛాయ్" అంటున్నాడు. ఆ అదలింపులో బలం లేదు. ఇంకో క్షణమైతే ఆ కుక్క పసివాణ్ని కబళించేదే. పక్కనున్న వారిని నెట్టుకుంటూ వేగంగా స్థిరంగా నడుస్తూ ఒకే ఒక కేకపెట్టాడు రవి. అది అతని గొంతులోంచికాక గుండె అంతరాళ్లోంచి ఓ శంఖారావంలా, యుద్ధానికి కాలుదువ్వుతున్న సైనికుని అరుపులా బయటకు వచ్చింది. ఆ కేక తీవ్రత ఎంత భయంకరంగా వుందంటే ఆ కుక్క దగ్గరికొస్తున్న రవిని ఆ పసికందును మార్చి మార్చి చూసింది. వెంటనే తోక ముడిచి పరుగెత్తుకుంటూ వెళ్లిపోయింది.

అందరూ ఆశ్చర్యంతో చూస్తుండగానే రవి ఆ పసివాడ్ని చేతుల్లోకి తీసుకున్నాడు. చుట్టూ ఉన్నవాళ్లు ఏదేదో అంటున్నారు. అవేవీ పట్టించుకునే స్థితిలో లేదు రవి. ఆ బిడ్డ వైపే చూస్తూ నడుస్తున్నాడు.

□ ■ □

రఘురాం ఆ కాకిపిల్లను గూడులో వదలాలని నిర్ణయించుకున్నాడు. దాన్ని జాగ్రత్తగా పట్టుకుని చెట్టెక్కాడు. దాన్నిగూడులో వదిలి ప్రేమగా తల నిమిరాడు. అప్పుడు చూసింది...

నోటినిండా ఆహారాన్ని నింపుకుని బిడ్డలకు అందించాలని వేగంగా వస్తున్న ఆ కాకిపిల్ల తల్లి. వెంటనే చెట్టుపైనున్న 'శత్రువు'ను గమనించింది. పెద్దగా రెక్కలు టప టప కొట్టుకుంటూ అరుచుకుంటూ రఘురాం చుట్టూ గిరికీలు కొడుతూ పొడవడానికి ప్రయత్నించింది.

అప్పుడు అర్థమైంది రఘురాంకు తను చేసిన తప్పేంటో. చాలా వేగంగా చెట్టు దిగసాగాడు. ఆ కాకి అరుపులకు దాని నేస్తాలు ఎక్కడెక్కడినుంచి వచ్చాయో ఆ చెట్టు చుట్టూ గిరికీలు కొడుతున్నాయి.

రఘురాం చాలా భయపడిపోయాడు. చకచకా చెట్టుదిగి వేగంగా ఇంట్లోకి పరుగెత్త సాగాడు. ఈ లోపే ఒక నాలుగైదు కాకులు కొన్ని మిస్సైల్స్ యుద్ధ విమానంనుంచి క్రిందకు జారినట్టు రఘురాం పైకి దూకి అందినచోటల్లా పొడవసాగాయి. రఘురాం మొహాన్ని చేతుల్తో కప్పుకుంటూ ఇంట్లోకి పరుగెత్తి వెంటనే తలుపేసుకున్నాడు. చేతులనిండా మొహంనిండా రక్తం కారుతూ ఇంట్లోకొచ్చిన భర్తను ఆశ్చర్యంగానూ భయంగానూ చూసింది అతని భార్య.

□ ■ □

చేతిలో పసిబిడ్డతో ఇంట్లోకి అడుగుపెట్టిన రవిని చూసింది సుమతి. "ఎవరా బిడ్డ" అన్నట్లు చూసింది. క్లుప్తంగా జరిగింది చెప్పాడు. లోపల్నుంచి అప్పుడే ఆ గదిలోకొస్తున్న అతని తల్లి అంతా వింది. అప్పుడే నిద్రనుంచి మేలుకుంటున్న అతని తండ్రికూడా విన్నాడు. వాళ్లందరికీ కొంతసేపు మాటలు రాలేదు. ముందుగా తేరుకున్నది అతని తల్లి.


"ఏ పాపిష్టిది కని పారేసిందో! ఎవరికీ లేని బాధ నీకెందుకురా! వెంటనే బయట ఏ చెత్తకుండీలోనో పడేసి రా" అంది.

రవి ఆ బిడ్డను మంచంమీద పడుకోబెట్టి ...

"సుమతీ! ఓ గ్లాసు పాలు తీసుకురా! అలాగే ఓ స్పూనుకూడా!" భార్య ఏమనుకుంటుందోనని గమనించే స్థితిలో లేదు రవి. అతని ఆతృతంతా ఆ పసి శరీరాన్ని బ్రతికించాలనే.

"ఒరేయ్ రవీ! లేనిపోని తలనొప్పి నీకెందుకురా! ఎవరి కన్నబిడ్డో. ఆ కన్నదానికే లేనిబాధ నీకెందుకురా! నలుగురూ నాలుగు రకాలుగా అనుకోకముందే ఆ బిడ్డను వదిలించుకోవడం మంచిది. వెంటనే ఎక్కడినుండి తెచ్చావో అక్కడే పడెయ్. వెళ్లు త్వరగా" తండ్రి గొంతులో వినిపించిన ఆతృతకు నివ్వెరపోయాడు.

పాలు తెచ్చిందేమోనని భార్యకోసం చూ



శాడు. సుమతి ఇంకా అక్కడే వుంది. ఒకసారి భార్య కళ్లలోకి చూశాడు. తనే లోపలికెళ్లి పాలు తెచ్చి పట్టసాగాడు.

"రవీ! నీవేదో ఘనకార్యం చేస్తున్నానను కుంటున్నావేమో! దీని పర్యవసానం ఎంత దారుణంగా వుంటుందో నీకర్థంకావడంలేదు నువ్వు తీసుకెళ్లి బయట పారేస్తావా లేక నన్నే పారేయమన్నావా?" తల్లి.

"నీకేరా చెప్పేది. చుట్టుపక్కలవాళ్లకు తెలిసి మన పరువు బజార్నపడేలోపు ఆ పీడ వదిలించు" తండ్రి.

కొద్దిగా ఆ బిడ్డలో చలనం రావడం చూసి రవి కళ్లు ఆనందంతో మెరిసాయి. 'వీళ్లు అసలు మనుషులేనా? ఆ చిన్నిప్రాణి గురించి కొంచెమైనా ఆలోచించకుండా వాళ్ల పరువు గురించి ఆలోచిస్తున్నారేగానీ కల్లాకప టం తెలియని, తన ప్రమేయం లేకుండా ఈ లోకంలోకి బలవంతంగా నెట్టబడ్డ ఆ తీత్రప్రాణి గురించి ఆలోచించరేం?'

కనీసం తన భార్య ఐనా అర్థం చేసుకుం టే చాలు. ఎవరేమనుకున్నా సరే! "నీ అభిప్రాయం ఏంట"న్నట్లు చూశాడు రవి. సుమతి నోరు విప్పింది.

□ ■ □

రఘురాం భార్యకు పరిస్థితి అర్థమై గాభరా పడిపోయింది. 'ఆ పాడు కాకిపిల్ల ఎటుపోతే మనకేం? అనవసరంగా కొనితెచ్చు కున్నారుకదండీ!" అంటూ డెట్టాల్‌లో ముంచిన కాటన్‌తో గాయాలు తుడవసాగిం ది. మంటతో చిన్నగా మూలుగుతున్నాడు రఘురాం.

"వుండండి. ఆ పాడుకాకులు పోయా యేమో చూస్తాను" అని తలుపుతీసి బయ టకు వచ్చి చూసింది.

"హమ్మయ్య! ఒక్క కాకీ లేదు. అన్నీ వెళ్లిపోయాయి. కానిపోని తలనొప్పి తెచ్చుకు న్నారుకదా!" అంటూ లోపలికి నడిచింది.

"ఎక్కడకండీ బయల్దేరుతున్నారు? ఆ ఫీస్‌కంటే ముందు హాస్పిటల్‌కు వెళ్లండి. సెప్టిక్ అవుతుందో ఏమో! కొంచెం రెస్ట్ తీసుకుని వెళ్లచ్చుగదా!"

"అదికాదోయ్. ఆఫీసులో అర్జంట్ వర్క్ వుంది. నీకు తెలుసుగదా! మా బాస్ అసలే చండశాసనుడు. వెళ్లాలి. ఇప్పటికే లేటయింది"

"సరే సరే... హాస్పిటల్‌కెళ్లడం మర్చిపో కండీ!"

"అలాగలాగే తలుపేసుకో"

రఘురాం గడపదాటి బయటకొచ్చాడు.

□ ■ □

రవి గడపదాటి లోపలికొచ్చాడు. 'డాక్ట రు దగ్గరకు తీసుకెళ్లడం మంచిదయింది. లేకపోతే బాబుకెంత ప్రమాదమయ్యేదో' స్వగతంగా అనుకుంటూ బాబును మంచం పై పడుకోబెట్టి లోపలి గదిలోకెళ్లాడు.

దగ్గర దగ్గర పదిమంది, వాన్నచుట్టూ ఐదుగురు అమ్మమట్టూ అంతే. ఏదో మాట్లాడుకుంటువున్నవారల్లా రవిని చూసి ఒక్కసారిగా ఆగిపోయారు. వాళ్లు అంత శ్రద్ధగా దేన్నిగురించి మాట్లాడుకుంటున్నా రో ఊహించడం పెద్ద కష్టమనిపించలేదు రవికి. వారిని పట్టించుకోకుండా కిచెన్‌లోకె ళ్లి పాలు తెచ్చి బాబుకు పట్టసాగాడు. అతని పరిస్థితి అతనికే విచిత్రంగా వుంది. 'నిన్నటి వరకూ ఎంతో ప్రేమగా చూసుకునే తల్లి, తండ్రి, భార్య. ఇప్పుడు అందరూ తనవో

శత్రువుగా చూస్తున్నారు. తను చేసిన పనిని కనీసం తన భార్య అయినా అర్థం చేసుకుంటుందనుకున్నాడు. అందరికీ ఇబ్బంది కలుగుతున్నప్పుడు తనకేమీ కాని ఈ బాబును ఎందుకు పట్టించుకోవాలి?''

బాబు నిద్రలోకి జారుకున్నాడు. గడపలోనే నిలబడి వున్న సుమతిని చూశాడు. కళ్లు కళ్లు క్షణంసేపు కలుసుకున్నాయి. ఏమనుకున్నాడో ఏమో బాబుపై పల్చటి దుప్పటి కప్పి బయటకు బయల్దేరాడు. అతని ఆప్తమిత్రుడు రఘురాం ఇంటికేసి నడుస్తున్నాయి అతని కాళ్లు.

□ ■ □

రఘురాం బయటికొచ్చాడో లేదో అప్పటికవరకూ ఎక్కడ దాక్కున్నాయో ఏమో, దగ్గర దగ్గర ఒక యాభై కాకులు ఒక్కసారిగా దాడిచేశాయి. పెద్దగా అరుస్తూ అందిన చోటల్లా పొడవసాగాయి. రఘురాం ఒక్కసారిగా బిక్కచచ్చిపోయాడు. లోపలికి పరుగెత్తుదామన్నా కాలు కదల్చలేని భయంలో కీచుగొంతుతో అరవసాగాడు. ఆ అరుపులకు ఒక్క ఉదుటున పరుగెత్తుకొచ్చింది అతని భార్య. పరిస్థితి గమనించి రఘురాం చెయ్యి పట్టుకుని వేగంగా లోపలికి లాక్కెళ్లింది. అదే వేగంతో తలుపు గడియపెట్టింది. రఘురాంకి ఒళ్లంతా రక్తసిక్తమైపోయింది. బట్టలు చిరిగి పీలికలైపోయాయి.

□ ■ □

రఘురాం పరిస్థితి చూసి బిత్తరపోయాడు రవి. ''ఇది నిజమా!'' అనుకున్నాడు. అతని ఆలోచన మానవత్వంలో ఒక చిన్న ప్రాణికి ప్రాణదానం చేద్దామని. కానీ ఆలోచన లేని కాకులు దాన్నర్థం చేసుకోలేక అతన్ని గాయపర్చాయి. రవికి తనకూ రఘురాంకూ సమస్య ఒకటేనని అర్థమైంది. ఆలోచన లేని కాకులు అతనిపై దాడిచేస్తే ఆలోచించగలిగి, హృదయమనేది వుండీ తనను తనవాళ్లు గాయపరుస్తున్నారు కాకుల్లా.

''ఈ మాయదారి కాకులను ఎలా వదిలించుకోవాలో అర్థం కావడంలేదన్నయ్యగారూ! మీరే ఏదో ఒక ఉపాయం చెప్పాలి''

సాలోచనగా తల పంకించాడు రవి. అతనికి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. అందులోనే తన సమస్యకూ ఒక జవాబు దొరికినట్టనిపించింది.

''ఎవర్నైనా పిలిచి ఆ చెట్టుకొమ్మలు కొట్టేయించరా. ఇంతకన్నా నీకు వేరే దారిలేదు. డాక్టర్ను కలువు. ఎందుకైనా మంచిది''

ఇంటికెళ్తూ ఇలా అనుకున్నాడు రవి. ''వాడు ఆ చెట్టుకొమ్మలు కొట్టేయించినంత తేలికకాదు తన సమస్యకు పరిష్కారం. ఎవరో తెలియనివాడి గురించి తన మనశ్శాంతి, సంసారం చెడగొట్టుకోవడం ఎందుకు?''

''ఏదైనా అనాథాశ్రమంలో వదిలేస్తాను. తన ఉద్దేశ్యం చావుబతుకుల్తో పోరాడుతున్న పసివాడ్ని కాపాడ్డం. రక్షించాడుకదా! ఇంకా తన దగ్గరే వుంచుకోవడంలో అర్థంలేదు.

మనసు తేలికపడి వేగంగా ఇంటికి నడవసాగాడు రవి.

□ ■ □